సాక్షి చిత్తూరు

ఆదివారం । 31 । మార్చి । 2024



వేర్వేరు చోట్ల రూ.36లక్షల పట్టివేత

జిల్లాలోని వేర్వేరు చోట్ల శనివారం పోలీసులు తనిఖీలు చేపట్టి రూ.36లక్షలు స్వాధీనం చేసుకున్నారు. - IIలో



అమర్ మాటలను జనం నమ్మరు

మాజీ మంత్రి అమరనాథరెడ్డి మాటలను జనం నమ్మరని వైఎస్సార్‌సీపీ ఎస్సీ నేతలు శనివారం తెలిపారు. - IIలో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ ఆదివారం (సా)	సహర్ సోమవారం (ఉ)
చిత్తూరు	6.30	4.49
పుంగనూరు	6.31	4.52

న్యూస్‌రీల్

సివిల్ కేసులపై పట్టు అవసరం



మాట్లాడుతున్న జిల్లా జడ్జి భీమారావు

చిత్తూరు అర్బన్: సివిల్ కేసులపై న్యాయమూర్తులు మరింత పట్టు పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావు తెలిపారు. శనివారం చిత్తూరులోని జెడ్పీ సమావేశ మందిరంలో 'సివిల్ సూట్స్–ఓ అవలోకనం' అనే అంశంపై న్యాయమూర్తులకు అవగాహన కల్పించారు. గతంలో జిల్లా జడ్జిలుగా పనిచేసిన పలువురు న్యాయమూర్తులను ఈ సమావేశానికి ఆహ్వానించారు. జిల్లా జడ్జి భీమారావు మాట్లాడుతూ నగదు లావాదేవీలు, కుదువ, ఆస్తి పంపకాలు, మధ్యంతర ఉత్తర్వులకు సంబంధించిన దావాలను న్యాయమూర్తులు జాగ్రత్తగా పరిశీలించాలన్నారు. దీంతో తమను తాము సన్నద్ధం చేసుకునే వెసులుబాటు ఉంటుందని వెల్లడించారు. చట్టం, స్థూలమైన అంశాలు, విధానపరమైన విషయాలపై విశ్రాంత అధికారుల అనుభవాలను సైతం పంచుకునేలా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ మేరకు తీర్పుల సమయంలో జడ్జిలు సమర్థవంతంగా పనిచేసే అవకాశం ఉంటుందని వివరించారు. సమావేశంలో రిటైర్డు న్యాయమూర్తులు జీవీ కృష్ణయ్య, మోహన్‌రావు, జేసురత్నకుమార్, న్యాయమూర్తులు కరుణకుమార్, అన్వర్‌బాషా, శాంతి, శ్రీదేవి, వెన్నెల, ఉమాదేవి, మాధవి, శ్రీనివాసమూర్తి, బాబ్జాన్, కీర్తన పాల్గొన్నారు.

4న తొలి ర్యాండమైజేషన్

చిత్తూరు కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికల కసరత్తులో భాగంగా ఏప్రిల్ 4వ తేదీన మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించనున్నారు. ఈ మేరకు కలెక్టరేట్ అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టారు. ర్యాండమైజేషన్‌లో ఎన్నికల విధులు కేటాయించిన పీఓ, ఏపీఓ, ఓపీఓలకు నియోజకవర్గాలను కేటాయించనున్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారం జిల్లా వ్యాప్తంగా 1,771 పోలింగ్ కేంద్రాలకు గాను 12,751 మంది పోలింగ్ పర్సనల్స్ నియమించనున్నారు. మొదటి ర్యాండమైజేషన్ తర్వాత మరోసారి అబ్జర్వర్ల సమక్షంలో ర్యాండమైజేషన్ నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఎన్నికల విధులకు ఉత్తర్వుల పొందిన ఉద్యోగులు తప్పక హాజరవ్వాలని ఆదేశించారు. విధులకు రిపోర్టు చేసుకోని ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు.

5 వరకు గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తులు

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు సమీపంలోని మైనారిటీ గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకునేందుకు ఏప్రిల్ 5వ తేదీ వరకు గడువు పెంచినట్లు ప్రిన్సిపల్ ఆంజనేయరాజు వెల్లడించారు. శనివారం ఆయన మాట్లాడుతూ 2024–25 విద్యాసంవత్సరంలో 5,6,7,8 తరగతులలో అడ్మిషన్ పొందేందుకు ఏప్రిల్ 25వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఇందుకోసం ఆసక్తిగల విద్యార్థులు www.aprs.apcfss.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఇన్‌చార్జి డీఆర్‌గా హరివర్మ

చిత్తూరు కార్పొరేషన్: రిజిస్ట్రేషన్‌శాఖ ఆడిట్ జిల్లా రిజిస్ట్రార్ (డీఆర్) ఉషారాణి శనివారం ఉద్యోగ విరమణ పొందారు. ఆమె స్థానంలో ఇన్‌చార్జిగా నెల్లూరు ఆడిట్ డీఆర్ హరివర్మను నియమించినట్లు డీఐజీ గిరిబాబు వెల్లడించారు.

సైకిల్‌కు నాంది

- తిరుపతిలో విచిత్ర పరిస్థితి
- కూటమితో చెదిరిన సైకిల్ గుర్తు
- ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులుగా బీజేపీ, జనసేన నేతలు
- ఆశావహులపై నీళ్లు చల్లిన టీడీపీ అధినేత
- వైఎస్సార్‌సీపీ ఛీకొట్టిన వారే ఇక్కడ కూటమికి పెద్దదిక్కు
- అవాక్కవుతున్న సీనియర్ ఎన్టీఆర్ అభిమానులు
- కుమిలిపోతున్న కరుడుకట్టిన టీడీపీ నేతలు

'పార్టీ పుట్టుక నుంచి టీడీపీనే అంటిపెట్టుకుని ఉన్నాం. కష్టకాలంలో అధినేతకు వెన్నంటే నిలిచాం. పార్టీ సిద్ధాంతాలు, ఆదేశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాం. కరుడుకట్టిన టీడీపీ వాదులమని గుర్తింపు తెచ్చుకున్నాం. ఎప్పుడైనా మా కల నెరవేరక పోతుందా..?.. టికెట్ రాకపోతుందా..? అని ఆశలు పెంచుకున్నాం. కూడబెట్టుకున్న పైసాపాతిక ఖర్చుచేశాం. ఇప్పుడు తీరా కూటమి అంటూ తీవ్రంగా అవమానించారు. ఆధ్యాత్మిక నగరంలో కనీసం పార్టీ గుర్తుకూడా లేకుండా చేశారు. అధికార పార్టీ ఛీకొట్టిన నేతల మోచేతికింద పనిచేయాల్సిన దౌర్భాగ్యపు పరిస్థితి వస్తుందని కలలో కూడా ఊహించుకోలేక పోయాం. ఇది రాష్ట్రంలో టీడీపీ కనుమరుగు కావడానికి సంకేతమనే చెప్పాలి. ఇప్పుడు ప్రజల్లోకెళ్లి మా కూటమి నేతలకు ఓటేయండని ఎలా అడిగేది చెప్పు బాబూ' అంటూ టీడీపీ అభిమానులు, నేతలు, కార్యకర్తలు రగిలిపోతున్నారు. తిరుపతిలో సైకిల్ గుర్తే లేకుండా చేశారంటూ మండిపడుతున్నారు.



కట్టప్పా..ఇదేంతప్పా?

తెలుగుదేశం పార్టీకి తిరుపతిలో విచిత్ర పరిస్థితి ఎదురైంది. ఎవరూ ఊహించని విధంగా తిరుపతి ఎమ్మెల్యే, ఎంపీ సీట్లు జనసేన, బీజేపీ ఎగరేసుకుపోయాయి. ఈ క్రమంలో టీడీపీ నేతల్లో అలజడి మొదలైంది. తిరుపతిలో సైకిల్ గుర్తు కనుమరుగు అయ్యిందని టీడీపీ వీరాభిమానులు కుమిలిపోతున్నారు. ప్రజల వద్ద సిగ్గుతో తలదించుకునే పరిస్థితి వచ్చిందంటూ మరికొందరు చర్చించుకుంటున్నారు. బాబు 40 ఇయర్స్ ఇండస్ట్రీ అనుభవం ఇదేనా? అంటూ మదన పడుతున్నారు. సైకిల్ గుర్తుపై ఒక ఓటు కూడా వేసే స్థితిని లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈవీఎంలో సైకిల్ గుర్తే కనిపించనప్పుడు మేమంతా ఓటింగ్‌కు ఎందుకు పోవాలంటూ ఎన్టీ రామారావు ఫాలోయర్స్, కరుడుగట్టిన టీడీపీ వాదులు ప్రశ్నిస్తున్నారు. టీడీపీ స్థాపించిన నాటి నుంచి తమకు ఎప్పుడూ ఇలాంటి పరిస్థితులు చూడలేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తిరుపతి తుడా: తిరుపతిలో కూటమి నేతలకు 2024 సార్వత్రిక ఎన్నికలు విచిత్ర పరిస్థితులను తెచ్చిపెట్టాయి. ఎవరూ ఊహించని రీతిలో అభ్యర్థుల మార్పులు, చేర్పులు చోటుచేసుకున్నాయి. పార్టీల జెండా, ఎజెండా కనుమరుగైంది. టికెట్ కోసం కష్టాలు ఎదుర్కొన్న నేతలను పక్కకు నెట్టాల్సి వచ్చింది. ఛీకొట్టి, పక్కనపెట్టిన అధికార పార్టీ ఎమ్మెల్యేలే ఇక్కడ కూటమికి పెద్దదిక్కుగా మారాల్సి వచ్చింది. కూటమి కుంపట్లు రగులుతున్న వేళ టీడీపీ ఆశావహులు తీవ్ర నైరాశ్యంలో మునిగిపోవాల్సి వచ్చింది.

ఛీకొట్టిన వారు.. స్థానికేతరులే కూటమికి పెద్దదిక్కు

పొత్తులో భాగంగా తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థిత్వాన్ని జనసేనకు, పార్లమెంటు స్థానాన్ని బీజేపీకి కేటాయించారు. జనసేన తిరుపతి సీటును వైఎస్సార్‌సీపీ చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు, బీజేపీ తిరుపతి పార్లమెంటు స్థానాన్ని గూడూరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే వరప్రసాదరావుకు కట్టబెట్టారు. ప్రజాసేవలో విఫలమై పోటీకి పనికిరారని పక్కనపెట్టిన వారే ఇప్పుడు ఇక్కడ కూటమికి పెద్ద దిక్కుగా మారారు. ఎందుకూ పనికిరారని తేల్చి పక్కనపెట్టిన వ్యక్తులకు టికెట్ ఇవ్వడంపై స్థానిక బీజేపీ, టీడీపీ, జనసేన నేతలు రగిలిపోతున్నారు. అభ్యర్థుల ఎంపికపట్ల కొందరు బహిరంగంగా, మరికొందరు లోలోపల కత్తులు నూరుతున్నారు. ఎలాగైనా అధికారంలోకి రావాలన్న చంద్రబాబు దిగజారుడు నిర్ణయంతో బలైపోయామని తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆయా పార్టీలు ఇటీవల ఆత్మీయ సమావేశాలను నిర్వహించి.. జనసేన నాయకులతో ఆరణి శ్రీనివాసులు, వరప్రసాద్‌తో బీజేపీ నాయకుల పరిచయ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సమావేశాలు రెండూ ఎడమొహం పెడమొహంగానే సాగాయి. ఆ నేతల పేర్లను ఉచ్చరించడానికి కూడా కొందరు ఇష్టపడలేదంటే ఇక్కడ పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

నిస్సహాయ స్థితిలో నేతలు

తిరుపతి ఎంపీ స్థానాన్ని బీజేపీకి, ఎమ్మెల్యే స్థానాన్ని జనసేనకు కేటాయించడంతో స్థానికులు రగిలిపోతున్నారు. స్థానికుల్లో ఎవరికో ఒకరికి టికెట్ ఇస్తే కలిసి పనిచేసేవాళ్లమని, స్థానికేతరులకు టిక్కెట్ ఇవ్వడం ఏమిటని పలువురు ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. టీడీపీ, జనసేన ముఖ్యనేతలంతా తీవ్రస్థాయిలో అభ్యంతరాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల టీడీపీ మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ సైతం తీవ్ర స్థాయిలో జనసేన అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించారు. అలాగే మిగిలిన టీడీపీ నేతలు సైతం ఆరణి శ్రీనివాసులు ఎంపిక పట్ల వ్యతిరేకతను వ్యక్తం చేస్తూ వస్తున్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు ఆ పార్టీ నేతలను మందలించడంతో ఇష్టం లేకున్నా ఒప్పుకోక తప్పలేదని కొందరు చెప్పుకొస్తున్నారు. దీంతో ఆయా పార్టీల నేతలు తీవ్ర నిస్సహాయ స్థితిలో మునిగిపోయినట్టు తెలుస్తోంది.

ముగిసిన 'పది' పరీక్షలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఈ నెల 18వ తేదీ నుంచి నిర్వహించిన పదో తరగతి పబ్లిక్ పరీక్షలు శనివారంతో ముగిశాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా విద్యాశాఖ అధికారులు పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించారు. ఈ క్రమంలో శనివారం ఓఎస్ఎస్‌సీ మెయిన్ ల్యాంగ్వేజ్, ఒకేషనల్ థియరీ పరీక్షలు జరిపించారు. ఈ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 702 మంది విద్యార్థులకు గాను 685 మంది హాజరైనట్లు అధికారులు వెల్లడించారు. 17 మంది గైర్హాజరైనట్లు వివరించారు.

పెయిడ్ న్యూస్‌పై ప్రత్యేక ఫోకస్

చిత్తూరు కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా కలెక్టరేట్‌లో ఎంసీఎంసీ (మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ) ఏర్పాటు చేశారు. నిరంతరం మీడియాలో వచ్చే ప్రకటనలు, వార్తలను పరిశీలించేందుకు సిబ్బందిని నియమించారు. రెండు షిఫ్టులలో పనిచేసేలా విధులు అప్పగించారు. ఈ కమిటీ సభ్యులు రోజూ సమావేశమై ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాల్లో వచ్చే ప్రతి పెయిడ్ న్యూస్‌ను పరిశీలిస్తుంది. అభ్యర్థులు తమ ప్రచారానికి చేసే వ్యయాన్ని ఎన్నికల ఖర్చులో చూపాల్సి ఉంటుంది. అయితే కొందరు అభ్యర్థులు ఎన్నికల ఖర్చు తగ్గించి చూపేందుకు తమ అనుకూలంగా పత్రికల్లో, ఎలక్ట్రానిక్ మీడియాలో కథనాల రూపంలో ప్రచారం వచ్చేలా చూసుకుంటారు. వీటిని పెయిడ్ న్యూస్ (ఆర్టికల్స్) అంటారు. అభ్యర్థులు ప్రసార మాధ్యమాల్లో ఇచ్చే ప్రతి అంశాన్ని కమిటీ సభ్యులు క్షుణ్ణంగా పరిశీలించి, పెయిడ్ న్యూస్‌గా భావిస్తే దానిని కమిటీ చైర్మన్‌కు నివేదిస్తారు.

సకాలంలో విద్యుత్ పరికరాలు

చిత్తూరు కార్పొరేషన్: సకాలంలో విద్యుత్ పరికరాలు అందించాలని ట్రాన్స్‌కో సీజీఎం సురేంద్ర నాయుడు ఆదేశించారు. శనివారం జిల్లాస్టోర్స్‌ను ఆయన పరిశీలించారు. విద్యుత్ పరికరాలను వెంటనే అందిస్తే క్షేత్రస్థాయిలో అభివృద్ధి జరుగుతుందన్నారు. పాత పరికరాలను నిబంధనల ప్రకారం వేలం వేయాలని సూచించారు. వేసవి నేపథ్యంలో లైన్‌లాస్, ఓవర్‌లోడ్ సమస్యలు ఎక్కువగా ఉంటాయని హెచ్చరించారు. ఈ సమయంలో వినియోగించే వస్తువులను ఇండెంట్ పెట్టి తెప్పించుకోవాలని కోరారు. ఏఈలు వివేకానందరెడ్డి, గున్నయ్య పాల్గొన్నారు.

సీఎం సభాస్థలి పరిశీలన



సూచనలిస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి, తలశిల రఘురాం

పూతలపట్టు: మేమంతా సిద్ధం యాత్రలో భాగంగా ఏప్రిల్ 3వ తేదీన పూతలపట్టులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటించనున్నారు. ఈ మేరకు నిర్వహించనున్న బహిరంగ సభాస్థలిని ముఖ్యమంత్రి ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ తలశిల రఘురాం, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి పరిశీలించారు. వారు మాట్లాడుతూ మండలంలోని పాలకూరు సమీపంలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పూతలపట్టు, కుప్పం ఎమ్మెల్యే అభ్యర్థులు సునీల్‌కుమార్, భరత్, పార్టీ మండల కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి, పాలఏకరి కార్పొరేషన్ చైర్మన్ కుమారరాజా, పార్టీ పెనుగొండ పరిశీలకుడు బాబురెడ్డి, నాయకులు మోహన్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

తుస్సుమన్న 'గర్జన'

- అసహనం వ్యక్తం చేసిన టీడీపీ అభ్యర్థి థామస్

పెనుమూరు(కార్వేటినగరం) : మండల కేంద్రంలో శనివారం బీసీ గర్జన పేరిట టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు సమావేశం నిర్వహించారు. ఆర్భాటంగా ఏర్పాటు చేసిన సభకు పట్టుమని వంద మంది కూడా హాజరుకాకపోవడంతో టీడీపీ అభ్యర్థి థామస్ అసహనం వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే పేరుకు బీసీ గర్జన అని చెప్పి ఒక్క బీసీ నేతను కూడా వేదికపైకి పిలవకపోవడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమైంది. టీడీపీ నేతలు పిలవకపోడంతోనే బీజేపీ మండల అధ్యక్షుడు గుత్తా వాసుదేవనాయుడు, జనసేన మండల అధ్యక్షుడు సభకు రాలేదని ఆయా పార్టీల నేతలు బహిరంగంగానే వ్యాఖ్యానించారు. టీడీపీ నేతల ఒంటెద్దు పోకడల కారణంగా బీసీ గర్జన తుస్సుమందని స్పష్టం చేశారు.

'పచ్చ'మూకల వేధింపులకే..!

- ఒకే రోజు 219 మంది వలంటీర్ల రాజీనామా



పలమనేరు : రాజీనామా పత్రాలను చూపుతున్న వలంటీర్లు

వి.కోట : సార్వత్రిక ఎన్నికలను సాకుగా చూపించి సేవాసైన్యంపై టీడీపీ నేతల వేధింపులు తీవ్రతరమయ్యాయి. కేవలం గౌరవ వేతనం తీసుకుంటూ ప్రభుత్వానికి ప్రజలకు వారధిలా చిత్తశుద్ధితో విధులు నిర్వర్తిస్తున్న వలంటీర్లపై పచ్చమూకలు నిస్సిగ్గుగా ఆరోపణలు చేస్తున్నాయి. నిస్వార్థంగా పనిచేస్తున్న సేవకులపై స్వార్థ రాజకీయాల కోసం తెలుగుదేశం పార్టీ శ్రేణులు బురదజల్లుతున్నాయి. ఈ క్రమంలో టీడీపీ నేతల వ్యవహారశైలికి వలంటీర్లు విసిగిపోతున్నారు. ఎక్కడికక్కడ రాజీనామాలు సమర్పిస్తున్నారు. అందులో భాగంగా శనివారం ఒక్క వి.కోట మండలంలోనే సుమారు 123 మంది వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను ఎంపీడీఓకు అందజేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాలను తాము తూచా తప్పకుండా పాటిస్తున్నామన్నారు. అయితే టీడీపీ నేతలు, కార్యకర్తలు తమను వెంటాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకపై ప్రజా ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించుకునేందుకు కార్యరంగంలోకి దూకుతున్నట్లు వెల్లడించారు.

పలమనేరులో 40 మంది..

పలమనేరు : ప్రజల కోసం సేవలందించే తమను టీడీపీ నాయకులు టెర్రరిస్టులతో పోల్చడం దారుణమని వలంటీర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు పలమనేరు మండలంలోని 40 మంది వలంటీర్లు రాజీనామా పత్రాలను సమర్పించారు. శ్రీకాళహస్తి టీడీపీ అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి వ్యాఖ్యలకు మనస్తాపం చెందినట్లు తెలిపారు.

గుడిపాల మండలంలో 56 మంది

గుడిపాల: టీడీపీ నేతల టార్చర్ భరించలేక 56 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. ఇకపై ప్రత్యక్షంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కోసం ఇంటింటి ప్రచారం చేపట్టనున్నట్లు వెల్లడించారు.



రాజీనామా పత్రాలతో మొరం పంచాయతీ వలంటీర్లు



మండిపేట కోటూర్ పంచాయతీ వలంటీర్లు



గుడిపాల: 189 కొత్తపల్లె వలంటీర్లు

కూటమికి ఓటేస్తే కల్లోలాలే..!

- ప్రశాంత పుంగనూరులో చిచ్చురేపుతారు
- అభివృద్ధిని అడ్డుకుంది కిరణ్.. చంద్రబాబే
- జగనన్నతోనే పేదల అభ్యున్నతి.. సంక్షేమం
- వైఎస్సార్‌సీపీ రాజంపేట ఎంపీ అభ్యర్థి మిథున్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, పక్కన ఎంపీ రెడ్డెప్ప



మైనార్టీ నాయకులతో ఎంపీ మిథున్‌రెడ్డి

పుంగనూరు : సార్వత్రిక ఎన్నికల్లో కూటమి కట్టిన టీడీపీ, బీజేపీ, జనసేనకు ఓటేస్తే మత కల్లోలాలు సృష్టిస్తారని వైఎస్సార్‌సీపీ రాజంపేట ఎంపీ అభ్యర్థి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ఆరోపించారు. శనివారం పట్టణంలో పార్టీ నేతలు, కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. మిథున్‌రెడ్డి మాట్లాడుతూ హిందూ, ముస్లింలు సోదరభావంతో జీవనం సాగిస్తున్నామని, కూటమి అభ్యర్థులు వస్తే ప్రశాంత వాతావరణంలో చిచ్చు పెడతారని విమర్శించారు. బీజేపీకి ఓటేస్తే అది టీడీపీకి వేసినట్టే అని.. టీడీపీకి మద్దతిస్తే అది బీజేపీకి ఇచ్చినట్టే అనే విషయాన్ని ప్రజలు గుర్తుంచుకోవాలని కోరారు. పుంగనూరు నియోజకవర్గంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేకమైన అభిమానం ఉందని, అందుకే అభివృద్ధి పనులకు రూ.వేల కోట్లు మంజూరు చేశారని వెల్లడించారు. ప్రజలకు తాగు, సాగు నీరు అందించేందుకు ప్రాజెక్టులు నిర్మిస్తుంటే సహించలేక కోర్టుల్లో కేసులు వేసి అడ్డుకున్నారని మండిపడ్డారు. గతంలో ముఖ్యమంత్రిగా పని చేసిన కిరణ్‌కుమార్‌రెడ్డి పుంగనూరు అభివృద్ధికి మోకాలడ్డారని ఆరోపించారు. అందుకే అప్పట్లో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రాజెక్టుల సాధనకు పాదయాత్ర సైతం చేపట్టారని గుర్తుచేశారు. అభివృద్ధి విఘాతకులైన కిరణ్, చంద్రబాబుకు ఓటు అడిగే అర్హతే లేదని స్పష్టం చేశారు. మాయమాటలు చెప్పి ప్రజలను మోసం చేసేందుకే కూటమిగా జతకట్టి వస్తున్నారని తెలిపారు. ఆ పార్టీలు అధికారంలోకి వస్తే మతతత్వ చట్టాలు తీసుకువచ్చి మైనారిటీలకు రక్షణ లేకుండా చేస్తారని హెచ్చరించారు. కుట్రపూరితంగా వ్యవహరించే ఇలాంటి పార్టీలకు ప్రజలే తగిన గుణపాఠం నేర్పాలని పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ముఖ్యమంత్రిగా జగనన్నను మళ్లీ గెలిపించుకోవాలని సూచించారు. ఏప్రిల్ 2వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మదనపల్లెలో సభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పెద్దసంఖ్యలో పార్టీ శ్రేణులు, ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం మైనారిటీ నేతలతో ఆత్మీయంగా ముచ్చటించారు. వైఎస్సార్‌సీపీ చిత్తూరు ఎంపీ అభ్యర్థి రెడ్డెప్ప, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు పెద్దిరెడ్డి, బైరెడ్డిపల్లి కృష్ణమూర్తి, రెడ్డెప్ప, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, జానపదకళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అమరనాథరెడ్డి ఓటమే లక్ష్యం



పలమనేరు : నేతలతో మాట్లాడుతున్న ఎంపీ మిథున్‌రెడ్డి

పలమనేరు : మాజీ మంత్రి అమరనాథరెడ్డి ఓటమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎమ్మెల్యే వెంకటేగౌడతో కలసి శనివారం గంగవరం మాజీ ఎంపీపీ, నియోజకవర్గ మాజీ కన్వీనర్ సీవీ కుమార్, పెద్దపంజాణి మాజీ ఎంపీపీ విజయభాస్కర్‌రెడ్డి తదితరులతో సమావేశమయ్యారు. మిథున్‌రెడ్డి మాట్లాడుతూ సీనియర్లకు పార్టీలో గుర్తింపు ఉంటుందన్నారు. నేతలందరూ సమష్టిగా ఎమ్మెల్యేగా వెంకటేగౌడను గెలిపించుకోవాలని కోరారు. జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవడమే ధ్యేయంగా పనిచేయాలని సూచించారు. ఈ మేరకు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, నేతలు మొగసాల కృష్ణమూర్తి, రెడ్డెప్ప, కోట్ల కిరణ్‌రెడ్డి, అబ్బూఖాన్ తదితరులకు దిశానిర్దేశం చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో నియోజకవర్గ మాజీ కో–ఆర్డినేటర్ రాకేష్‌రెడ్డి, గంగవరం కన్వీనర్ మోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు చంద్రప్ప, చెంగారెడ్డి, శ్రీరాములు రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

సారా విక్రేత అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

చిత్తూరు అర్బన్: నగరంలో సారా విక్రయిస్తున్న చిన్నయ్య (58) అనే నిందితుడిని శనివారం వన్ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ విశ్వనాథరెడ్డి కథనం మేరకు.. నగరంలోని బండపల్లె రోడ్డులో మూడో గేటు వద్ద సారా విక్రయాపై పోలీసులకు సమాచారం అందింది. ఎస్ఐ షేక్ షావలీ తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. చిన్నయ్యతో పాటు గుడిపాల మండలం రాసనపల్లెకు చెందిన దేవదేసు అనే వ్యక్తి వద్ద 41 లీటర్ల సారా పట్టబడింది. చిన్నయ్యను అదుపులోకి తీసుకోగా.. దేవదాసు పరారయ్యాడు. నిందితుడి నుంచి సారాతో పాటు రూ.4,300 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వెల్లడించారు.

ఎర్రచందనం పట్టివేత



పట్టుబడిన దుంగలు

పెద్దపంజాణి: మండలంలోని రాయలపేట వద్ద కారులో తరలిస్తున్న ఎర్రచందనం దుంగలను శనివారం అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా కారులో నుంచి దూకి పరారవుతున్న నలుగురు దుండగుల్లో ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపటి నుంచి 'పది' మూల్యాంకనం

చిత్తూరు కలెక్టరేట్ : పదో తరగతి మూల్యాంకనం సోమవారం నుంచి ప్రారంభంకానున్నట్లు డీఈఓ దేవరాజు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈమేరకు ఉత్తర్వులు పొందిన టీచర్లందరూ ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు చిత్తూరు పీసీఆర్ ఉన్నత పాఠశాల కేంద్రంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నేతలు



ఎమ్మెల్యే వెంకటేగౌడతో శ్రీధర్ చౌదరి



పార్టీలో చేరినవారితో విజయానందరెడ్డి

పలమనేరు : జిల్లాలోని పలమనేరు, చిత్తూరులో టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీలో చేరారు. పలమనేరు మండలంలోని మండిపేట కోటూరుకు చెందిన టీఎన్ఎస్ఎఫ్ జిల్లా నాయకుడు శ్రీధర్ చౌదరి ఎమ్మెల్యే వెంకటేగౌడ సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి, మాజీ కన్వీనర్ మండీసుధా, ఎస్టీ నాగరాజు, శ్యామ్‌సుందర్, క్యూడీఎస్ రాజేష్, రాజు, నరేష్, నవీన్, హేమంత్, ముజ్జు పాల్గొన్నారు.

చిత్తూరు కార్పొరేషన్: నగరంలోని కన్నయ్యనాయుడుకాలనీకు చెందిన టీడీపీ నేత లక్ష్మీకాంతం అలియాస్ అమ్ములు తన అనుచరులు 30 మందితో వైఎస్సార్‌సీపీలో చేరారు. చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి వారికి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

గంగ జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు



జమీందార్లతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా

పుంగనూరు : పట్టణంలో వెలసిన సుగుటూరు గంగమ్మ తల్లి జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా తెలిపారు. శనివారం పుంగనూరు జమీందార్లు సోమశేఖర చిక్కరాయల్, మల్లికార్జున రాయల్‌తో సమావేశమయ్యారు. జాతర ఏర్పాట్లపై చర్చించారు. అలీమ్‌బాషా మాట్లాడుతూ ఏప్రిల్ 2, 3 తేదీల్లో జాతరను వైభవంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. భక్తుల సౌకర్యార్థం మెరుగైన మౌలిక వసతులు కల్పించనున్నట్లు చెప్పారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో జాతర జరిపించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అనంతరం పీడీఎఫ్ అధ్యక్షుడు భానుప్రకాష్ ఆధ్వర్యంలో జాతర టీషర్టులను జమీందార్లు విడుదల చేశారు. సమావేశంలో సీమ జిల్లాల మైనార్టీ సెల్ ఇన్‌చార్జి ఫక్రుద్దీన్ షరీఫ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు జయరామ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అమరేంద్ర, కౌన్సిలర్లు త్యాగరాజు, నరసింహులు , వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ అమ్ము, నాయకులు కిషోర్, మునిరాజా, అఫ్సర్, జావీద్, నాని పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

– ఇద్దరు నిందితుల అరెస్ట్



నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

రామకుప్పం: మండలంలోని రాజుపేట గ్రామం వద్ద శుక్రవారం రాత్రి కర్ణాటక మద్యం పట్టుబడింది. వివరాలు.. రామకుప్పానికి చెందిన హరినాయక్ అతడి తమ్ముడు రవినాయక్ బైక్‌పై కర్ణాటక మద్యం తీసుకువస్తుండగా ఎఫ్ఎస్‌టీ బృందం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ శివకుమార్ తెలిపారు. నిందితుల నుంచి బైక్‌తోపాటు రూ.44వేల విలువైన 1,056 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

మూల్యాంకనంలో మినహాయింపులకు వినతి

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరులో ఏప్రిల్ 1 వ తేదీ నుంచి నిర్వహించనున్న పదో తరగతి మూల్యాంకనంలో తీవ్ర అనారోగ్య సమస్యలున్న వారికి మినహాయింపులు ఇవ్వాలని ఫ్యాప్టో (ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య) నేతలు కోరారు. ఈ మేరకు శనివారం సాయంత్రం పీసీఆర్ పాఠశాలలో డీఈఓ దేవరాజును కలిసి వినతిపత్రం ఇచ్చారు. సంఘం చైర్మన్ మునాఫ్ మాట్లాడుతూ గత ఏడాది నిర్వహించిన మూల్యాంకనం బకాయిల చెల్లించాలని కోరారు. రంజాన్ నేపథ్యంలో ముస్లిం టీచర్లకు మినహాయింపులు ఇవ్వాలని సూచించారు. నాయకులు గంటామోహన్, జీవీ రమణ, మదన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

తల్లీకూతురిపై దాడి : కేసు నమోదు

చిత్తూరు అర్బన్: తల్లీకూతురిపై దాడి చేసిన ఘటనలో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. నగరంలోని బీపీఏఆర్ గార్డెన్ వద్ద ఓ అపార్ట్‌మెంట్‌లో భానుప్రియ అనే మహిళ తన కుమార్తెతో కలిసి నివసిస్తోంది. ఆమె ప్లాట్ ఎదురుగా లిఫ్ట్‌కు అపార్ట్‌మెంట్ కమిటీ వారు సీసీ కెమెరా ఏర్పాటు చేశారు. అయితే ఆ కెమెరా తన ఇంటి గుమ్మానికి నేరుగా ఉండడంతో భానుప్రియ పక్కకు జరిపింది. దీంతో పై ప్లాట్‌లో నివసించే ప్రభుత్వ ఉపాధ్యాయుడు నిరంజన్‌రెడ్డి, ఆయన భార్య పద్మజ ఆగ్రహించారు. భానుప్రియ, ఆమె కుమార్తెపై దాడి చేసి చావబాదారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, నిందితులు పరారీలో ఉన్నారని, త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని సీఐ ఉలసయ్య తెలిపారు.

కత్తితో పొడిచిన ఆర్ఎంపీపై కేసు నమోదు

పలమనేరు : పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద టీస్టాల్ యజమాని షాజహాన్‌ను కత్తితో పొడిచిన ఆర్ఎంపీ శివశంకర్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్టు సీఐ చంద్రశేఖర్ శనివారం తెలిపారు. షాజహాన్ టీ దుకాణం నిర్వహిస్తూ గ్లాసులను శివశంకర్ గది వద్ద పడేస్తుండడంతో ఇద్దరి మధ్య వివాదం మొదలైంది. ఈ క్రమంలో ఆగ్రహించిన శివశంకర్ కత్తితో షాజహాన్‌పై దాడ చేశాడు. బాధితుడే పిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్టు సీఐ వెల్లడించారు.

అమర్ మాటలను జనం నమ్మరు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

పలమనేరు : మాజీమంత్రి అమరనాథరెడ్డి మాటలను జనం నమ్మరని వైఎస్సార్‌సీపీ ఎస్సీ నాయకులు తెలిపారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో వారు విలేకర్లతో మాట్లాడారు. టీడీపీకి ఇవే చివరి ఎన్నికలు కాబట్టి ఎలాగైనా గెలవాలని కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. కమీషన్లు తీసుకోకుంటే అమరనాథరెడ్డి ధైర్యంగా వచ్చి శివాలయంలో ప్రమాణం ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. అక్రమాలు చేసినందుకే దేవుని ముందు ప్రమాణానికి భయపడ్డారని స్పష్టం చేశారు. తప్పు చేసి తప్పించుకోవడం కోసం చోటా నాయకులతో ప్రెస్‌మీట్లు పెట్టించడం ఆయనకు అలవాటని విమర్శించారు. సమావేశంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, రాష్ట్ర ఎస్టీ సంఘ నేత నాగరాజు, ఎస్సీ నాయకులు శ్రీనివాసులు, ఏఎంసీ చైర్మన్ హేమంత్ కుమార్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి మురళీకృష్ణ, పట్టణ కన్వీనర్ జాఫర్, మాజీ కన్వీనర్ మండీసుధా, మున్సిపల్ వైస్ చైర్మన్ రవి, కౌన్సిలర్లు రహీంఖాన్, కోదండరామయ్య, శ్యామ్, శ్యామ్ సుందర్‌రాజు, మూర్తి, సుందరేష్, షబీర్, హయాత్, కమాల్, హైదర్, ఫైయాజ్, భరత్, మునస్వామి, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల రూ.36లక్షలు పట్టివేత

పలమనేరు : పట్టణంలోని జిలానీ క్రాస్ వద్ద ఓ ఇంటిపై పోలీసులు, ఎన్నికల అధికారులు శుక్రవారం అర్ధరాత్రి దాడి చేశారు. లక్ష్మీ అనే మహిళ వద్ద ఎటువంటి లెక్కలు లేని రూ.16లక్షలు స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ మహేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు సెర్చ్ వారెంట్‌తో ఇంట్లోకి ప్రవేశించిన పోలీసులు బీరువాలోని నగదును సీజ్ చేశారు. స్వాధీనం చేసుకున్న నగదును ఉన్నతాధికారులకు పంపినట్లు సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ సహదేవి తెలిపారు.

చౌడేపల్లె : బోయకొండ మార్గంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద శనివారం రాత్రి వాహనాల తనిఖీల్లో కారులో తరలిస్తున్న రూ:20 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ప్రతాప్ రెడ్డి తెలిపారు. అయితే ఇండియా ఏటీఎం ఏజెన్సీ తరఫున ఏటీఎంలలో నగదు లోడ్ చేయడానికి వెళుతున్నట్లు వారు చెప్పారన్నారు. పట్టుబడిన నగదును సర్కిల్ కార్యాలయానికి తరలించినట్లు వెల్లడించారు. సరైన ఆధారాలు సమర్పిస్తే ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు నగదును తిరిగి అప్పగిస్తామని వివరించారు.

కర్ణాటక మద్యం తరలిస్తున్న మహిళ అరెస్ట్

వి.కోట: కర్ణాటక మద్యం తరలిస్తున్న ఓ మహిళను శనివారం అరెస్ట్ చేసినట్లు సీఐ లింగప్ప తెలిపారు. వివరాలు.. మండలంలోని కస్తూరి నగరం గ్రామానికి చెందిన మోహన్ భార్య పర్మిల (32) తన స్కూటీలో కర్ణాటక నుంచి 192 టెట్రా ప్యాకెట్లు తీసుకువస్తూ పోలీసులకు పట్టుబడింది. ఈ మేరకు నిందితురాలిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

సైనిక్ స్కూల్ ఫలితాల్లో విశ్వం ప్రభంజనం



ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థినులు వంశితశ్రీ, మనోజ్ఞబాయ్, సోనిక, ధర్షిణిశ్రీ, నిత్యశ్రీ, వర్షిణి

తిరుపతి ఎడ్యుకేషన్ : కిట్టూరు బాలికల సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షా ఫలితాల్లో తిరుపతిలోని విశ్వం విద్యాసంస్థ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి ప్రభంజనం సృష్టించారని ఆ విద్యాసంస్థ అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. జాతీయ స్థాయిలో నిర్వహించిన ఈ ప్రవేశ పరీక్షా ఫలితాల్లో తమ విద్యార్థులు వంశిత శ్రీ, మనోజ్ఞ భాయ్, సోనిక, ధర్షిణిశ్రీ, నిత్యశ్రీ, వర్షిణి బాలికల సైనిక్ స్కూల్‌కు ఎంపికైనట్లు పేర్కొన్నారు. గత 34 ఏళ్లుగా జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న సైనిక్, నవోదయ, మిలిటరీ స్కూల్స్ వంటి పోటీ పరీక్షల్లో తమ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తూ ఆయా విద్యాసంస్థల్లో ప్రవేశాలు సాధిస్తుండడం తమ విద్యాసంస్థలకే గర్వకారణమన్నారు.. అనంతరం ఎంపికైన విద్యార్థులను కరస్పాండెంట్ ఎస్.తులసి, అకడమిక్ డైరెక్టర్ ఎస్.విశ్వచందన్‌రెడ్డి అభినందించారు.